# 'నిషాదం'

[కథానిక]

శ్రీ కందుకూరి లింగరాజు

"ఈ మొఖంతోటి నన్ను చూడ్డానికి వచ్చేవా? ఇన్నాళ్లూ లేని తీరుబడి ఇప్పుడు దొరికింది కామా?" అని, అంతవరకూ అంతూ పొంతూ లేని దుఃఖంతో ఆవృతమైన పార్వతమ్మ అనడం సీతారామయ్యకు గుండెల్లో సునపం గ్రుచ్చినట్టే అయి, మాటల్లేకనే గోడకు జేరబడిపోయేడు. తను ఏ లోకంలో వున్నాడో కూడా అర్థం కాలేదు. కళ్లు మాత్రం ఒప్పగించేడు.

"మాట్లాడ్డాని కేముంది? బ్రతికినన్నాళ్లూ రాలేనివాడివి ఇప్పుడైనా వచ్చేవుకదా" అని కన్నీళ్లు తుడుచుకుంటూనే పార్వతమ్మ ఏడ్పు మొదలెట్టింది.

దారిపొడుగునా చెట్టంత దుఃఖంతో కళ్లు ఎర్రబారినై. తన అక్కగారికి ఆవయస్సులో తీరని కష్టం వచ్చిందని ఏడ్చేడు. ఇప్పుడు తను ఏడ్వాలో ఏం చెయ్యాలో కూడా తెలియలేదు. స్వభావంగా బావగారియెడ వున్న గౌరవ, ప్రేమ, వాత్సల్యాలు కూడా ఈవిరుద్ధపరిస్థితిలో తనకు ఏమీ సహకరించలేకపోయేయి. తన అక్కగారికి అంతకష్టం కల్గించే పని తను ఏంచేశాడో కూడా తెలియలేదు. ఆయన జీవించి వున్నన్నాళ్లూ తను అడుగులకు మడుగులు ఒత్తినా, ఇప్పుడు, ఈక్షణంలో అక్కగారు ఇల్లా అనడానికి తగినకారణం కనుపించలేదు.

తలతెగిన మేకలాగే, తల ఒంచుకుని బావురుమన్నాడు. కన్నీళ్లు కొంత శాంతాన్ని ఇచ్చినా, బయటకు అడుగులు వేసేటప్పుడుమాత్రం గుండెలు గుబగుబలాడేయి. తన ఆత్మే ఎందుకో భయపడింది. ఏదో ఉప్పెన ఒస్తుందన్నట్టే.

ఆరోజు భోజనాలు చేస్తున్నపుడే వేలు ముడిస్తే నాల్గోసారో, ఐదోసారో మేనమామ "సీతాయ్! మరి పార్వతిని తీసుకువెళ్లవా?" అని అడిగేడు. మాటల్లోనే అన్నాడు 'అల్లాగే' అని. అంతకంటే ఎక్కువ మాటలు రాలేకపోయేయి. మేనమామ అనునయ అభినయాల్తోనే చచ్చిపోయిన బావగుణగణాలను పొగిడేడు. మానవలోకంలోని సంప్రదాయం అదేకాబోలు ననుకున్నాడు. బావగారు బ్రతికున్నకాలంలో ఈయన ఒక్కసారైనా ఒచ్చినట్టు జ్ఞాపకం లేదు. ఈనాడు ఎక్కడలేని ఆపేక్షా ఒలికిపోయినట్లే కబుర్లు చెప్తున్నాడు.

జీవితాలు ఎంతలో విచ్ఛిన్నమైపోతాయో బోధపడినా, భావిలో అక్కగారిని ఏవిధంగా అనునయించేసి, ఆవిడకి శాంతి కల్పించగలనా అన్న అధైర్యం ఒచ్చింది. కాని కల్పించగలనన్న పురుషి వుంది. తన భార్య తనమాటలకు జవదాటదన్న నమ్మకం వుంది. అయినా ఈనాడు అక్క అన్న వాక్యాలుమాత్రం జీవితాన్ని భయపెడుతున్నై. శాంతం వుండదంటున్నై.

లోపలిగదుల్లో ఒక్కసారి గొల్లుమన్నట్టయితే ఉలిక్కిపడ్డాడు. అడుగులు బరువుగా వేసుకుంటూ వెళ్లేడు. ఇప్పుడు ఆఅక్కగారి గదిలోకి వెళ్లాలంటేనే భయం పట్టుకుంది. గుమ్మంవరకూ వెళ్లేసరికే "బావా!

ఈనాడు ఇల్లా అవుతానని అనుకునివుండవు కాదుకదూ? నా తర్వాత ఇల్లా వుండాల్సివుంటే..." ఇక ఎక్కిళ్లల్లో వినిపించలేదు. వేసే అడుగు వెనక్కి ఆగినట్టే అయింది. కొద్దిఘంటల్లోనే ఆ స్వరభేదం ఒకేవాతావరణంలో వున్నా, పార్వతమ్మలో కనపడడం ఆశ్చర్యం కలిగించింది. ఏదో కుతూహలం మొలకలెత్తింది.

"పారూ!"

"బావా..."

సీతారామయ్యకు ఆపిలుపులో ఏవో గూఢార్థాలు వ్రాసినట్టనిపించింది. ఇదివరకు తన తల్లీ తండ్రీ వున్నపుడు పార్వతిని ఉమాపతికి ఇద్దామని అనుకోవడం, కట్నాలగొడవల్లో చెడిసిపోవడం గుర్తు వుంది. వాళ్లిద్దరూ చిన్నప్పుడు దంపతులక్రింద బొమ్మలాటలు ఆడుకోవడం తెలుసు. అది సఫలీకృతమవుతుందని అనుకున్నారని ఇప్పుడు తెలియడంతో దుఃఖం పట్టపగ్గాలు లేకుండానే ఉబికింది.

తన జీవితంలో తనూ ప్రేమించేను అనుకున్నాడు. దానిలో వుండే హృదయపుఆరాటం రుచిచూచేడు. కాని అది గతించిన సంవత్సరాల్లో సంసారంలో పడి ఉందో లేదో అనిపించింది. ఇప్పుడు పార్వతీ, అటు ఉమాపతీకూడా ఇటువంటి అగ్నిని మూటకట్టుకుని బాధపడుతున్నారని అనుకోవడంలో, తను మరిచిపోయిన దినాలు జ్ఞాపకం వచ్చేయి.

ఆ సఫలీకరణానికి తన పేరు, ప్రతిష్ఠలు త్యాగం చేద్దామనుకున్నా, సంఘం, మళ్లీమళ్లని పార్వతి వయస్సూ ఒప్పుకోదు. తను చెప్పలేదు. ఉబికిన దుఃఖం మ్రింగుకుంటూనే కళ్లు తుడుచుకున్నాడు.

తలుపుబందుల సందుల్లోంచి, కళలేని ముత్తయిదువతనం చచ్చినందుకు దిగాలుపడడం కన్పడింది. ఉమాపతిఖండువాఅంచులు ఊగుతున్నాయి. దొంగతనం చేస్తున్నట్టుగానే సీతారామయ్యహృదయం బాధలో తప్తమైన, ఉమాపతిని చూడాలన్న నియమం ఆపింది.

"తలలు ఎప్పుడూ ఒకలుకోలేం. వాట్లతో జీవించడం మానవులకు ఉగ్గుపాలతో పోసేరు...పారూ! వెళ్లివస్తా" ఉమాపతి గుమ్మం దాటుతూనే సీతారామయ్యను చూచేసరికి; ఆగని ఆవేదనతోనే "బావా!" అని సీతారామయ్యను కౌగిలించుకున్నాడు.

ఉమాపతి హృదయంలో తను ఓ శాంతి పొందగలనన్న ధైర్యంతోనే, చంటిపిల్లవాడిక్రిందే వెక్కివెక్కి ఏడ్చేడు. అనునయంగానే "ఊరుకో బావా! మంచివాళ్లకే ఎప్పుడూ భగవంతుడు కష్టాలు ఎక్కువగా పెడతాడు. పారూ ఏపాపం చేసిందని? ఆమెను నువ్వు బాధ మరిచిపోయేట్లు చెయ్యాలి. అంతకంటే ఏం చెప్పలేను." ఉమాపతిమాటల్లో ప్రేమమూర్తీభవించినట్టే తట్టింది. ఓనిముషంగా తను నిర్ణయం చెయ్యలేని కర్తవ్యం ఇప్పుడు రూపంపొందింది. అయినా తన్ను చూడగానే పారూ అన్న ఎత్తిపొడుపుమాటలకు, ఇప్పుడు ఏర్పడుతున్న రూపానికి సమన్వయం అవుతాయా అన్నదే సమస్యక్రింద వుంది.

భుజం పట్టుకునే వీథిలోకి వచ్చేరు. ఉమాపతిని చూస్తుంటే ఏవో లేని ధైర్యం, గౌరవంకూడా సీతారామయ్య పొందినట్లే వుంది. ఇంకేమైనా చెపుతాడేమో అన్న ఆశ కలిగినా, తను ఏంఅనాలో, ఏం అడగాలోకూడా తెలియలేదు.

"ఒకానొక కాలంలో పారూ నాకు చుక్కాని అవుతుందని అనుకున్నా. ఇద్దరం చేదోడువాదోడుగా ఉంటామని ఆశించేను. కాని విభిన్న పరిస్థితుల్లో ఇద్దరం పడిపోయేం. ఈనాడు పారూను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. సీతాయ్! నాకోసంఅయినా పారూకు కష్టం, దుఃఖం అన్నది లేకుండా చెయ్యి. అదే నిన్ను కోరుతున్నా" అని ఉమాపతి చేతులు పట్టుకున్నాడు.

సీతారామయ్యగుండె చెరువైపోయింది. అమితదుఃఖంలోనే, ఉమాపతిచేతుల్లో వాలిపోయే "అల్లాగే బావా" అనిమాత్రం అనగల్గేడు. అందులో ఓ శాంతి పొందినట్టుమాత్రం ధైర్యం వుమిలింది.

ఆమర్నాడు రైలు ఎక్కించేటప్పుడు ఉమాపతి దగ్గరనే ఉన్నాడు. ఉమాపతిహృదయంలో చూస్తూ, అతని మాటలు వింటూ, అతనికోసం అన్నదాంట్లోనే

సీతారామయ్యకు ఉత్సాహం కలిగింది. దానికి కారణం ఏమిటి అంటే తను చెప్పలేడు. పారూకూడా చెప్పలేదేమో!

రైలుకిటికీలోంచే "పారూ! దుఃఖం అన్న దాన్ని మ్రింగడం అలవాటుచేసుకో. దాన్నే మననం చేసుకుని, నిర్జీవత పొందడం, నిరాశతో ఏడ్వడం కూడా మానవలక్షణం కాదు. కాలం అనేది నీకు ఆ ధైర్యాన్ని ఇస్తుందన్న ధైర్యం వుంది. పారూ, జీవితాన్ని మనం ఏపరిస్థితుల్లో వున్నా, జయించి ఆనందమయం చేసుకోవాలి"అన్నాడు.

వినిపించీవినిపించనట్టు అవి సీతాయికి వినిపించేయి. ఉమాపతిది కవిహృదయం. లోపల్లోపలే బడబాగ్నులతో దహించుకుంటూ, పైకి నివురుకప్పిన నిప్పు అని తెలుసు. అతని కథల్లో తను ఎన్నోసార్లు చూచేడు. జీవితానికి దుఃఖమే పరమావధి. ఎక్కువ దుఃఖంలో ఎప్పుడూ ఆనందం వుందన్న వేదాంతం తరచితరచి చెప్పేవాడు. ఈనాడు అదే అతని నోటమ్మట వచ్చింది.

బండి కదిలింది. నూత్నపరిణామంలో నున్న పారూ, కళ్లార్పకుండానే, చేతులు జోడించింది. ఉమాపతి దుఃఖంతోనే, వెనక్కు తిరిగి గబగబా అడుగులు వేసేడు. దూరమైపోతున్న రైలులోనుంచి ఉమాపతి కళ్లు తుడుచుకున్నట్టు కనపడ్డంతో, సీతారామయ్యకు, తను ఈ విచిత్రఘట్టంలో ఏ కోసని ఉన్నాడో తెలియలేదు.

దిగనారుగానే, తనచోటులో కూర్చుని ఆలోచించడం ప్రారంభించేడు. ఏవోఏవో వచ్చేయి. అవి విచిత్రంగా వున్నా, వ్యక్తావ్యక్తంలోనే కలలు, ఆశలులాగే తట్టేయి.

* * *

వీథిగుమ్మంలో బండి దిగి లోపలికి వెళ్లేటప్పటికి వెంకటలక్ష్మి ఎదురుగా వచ్చింది. బావురుమంటూనే రెక్క పట్టుకుని లోపలికి తీసుకువెళ్దామని చెయ్యి చాచేసరికి "ఆరోజుల్లో చూడ్డానికి తీరుబడి లేనిదానవు, ఈరోజుల్లో ఆపేక్ష ఒలకరించనక్కర లేదు"అని విసురుగానే లోపలికివెళ్లింది పార్వతి. వెంకటలక్ష్మి,ఇటుసూటుకేసులోపలపెడుతున్న సీతారామయ్య కొయ్యఅయ్యేరు. అడుగులోనే హంసపాదుతో ప్రారంభమైన దీనికి ఎటూ పాలుపోనేలేదు. "నిన్న కాక మొన్ననే పథ్యం పుచ్చుకుంది. అంచేత నేనే తీసుకురాలేదు." అని అందామనుకున్నా, సీతాయికి ధైర్యం చాలలేదు. దైన్యంగా, బాధలో వెంకటలక్ష్మిచూపులు తన బాధ్యతను గుర్తుకుతెప్పిస్తే "లేదక్కా! దానికి పదిరోజులనుండి జ్వరం, రెండు రోజులే అయింది మెతుకు కొరికి" అని అన్నాడు.

మడమమీదనే గిర్రన తిరుగుతూ పార్వతి "ఈమొఖాన్ని ఎప్పుడు చూస్తే ఏముందిరా" అని లోపలికి వెళ్లింది.

వెంకటలక్ష్మి వెనకాలే వెళుతూ "అల్లా అంటారేం ఒదినా! పుట్టెడంత దుఃఖంలో రాలేక పోయేనని ఎంత ఏడుస్తున్నాను. మాయిదారిజ్వరం పీక్కుతినకుండా వుంటే......" అంతవరకూనే విన్నాడు సీతాయి. తర్వాత ఏం జరిగిందో తనకు వినిపించలేదు. ఏదో భోజనాలకు వెళ్లేవరకూ, తుమార్పణగా, వెంకటలక్ష్మి అంటూనే ఏదోఏదో వెనక వెనక తిరుగుతూ ఉండడంమాత్రం చూచేడు.

అంతవరకూ ఆ పదిహేనురూపాయల చిన్న ఇంటికి వెంకటలక్ష్మి, తనూతప్ప ఇంకెవ్వరూ లేనే లేరు. రెండువత్సరాలక్రితం బావమరిదికొడుకు ఓసంవత్సరం ఉండి చదువుకొని వెళ్లిపోయేడు. ఇన్ని రోజులూ వెంకటలక్ష్మిని తను అర్థంచేసుకోవడం లోనూ, తన్ను వెంకటలక్ష్మి పరీక్షించడంలోనూ, సరిపోయింది. సీతాయి అనేకవిధాలుగా వెంకటలక్ష్మిని తరచిచూచేడు. మొట్టమొదట్లో స్కూల్ ఫైనల్ వరకు చదివి, ఒక్కగానొక్కర్తె కూతురైన పిల్ల, కష్టాల్లో సుఖాల్లో ఆదుకోగలదా అని అనుమానపడ్డాడు. అయినా రోజులు జరగడంతో, తన వూహాలు పటాపంచలవడంతో సిగ్గుపడ్డాడు.

ఇప్పుడు నిజంగా పార్వతి రావడం ఓపరీక్ష లాంటిదే. అందులోనూ, ఒక్క వెంకటలక్ష్మికేకాక

తనకుకూడా గడ్డుసమస్యలాంటిది. ఏక్షణంలో ఆ కరకుముక్కలు పారూ అందో, అప్పటినుండీ తనమీద నిష్కారణంగానే పగపట్టినదని గ్రహించేడు. తల్లినీ, తండ్రినీ గోల్పోయినతర్వాత అంతవరకూ తను అక్కకుగాని, బావకుగాని ఏవిధమైన లోపం లేకుండానే జరిపేడు. ప్రతిపండగకూ పిల్చేడు. బట్టలు పెట్టేడు. తన చర్యల్ని సింహావలోకనం చేసుకుంటే, ఏవిధమైన కష్టం కలిగి పని చెయ్యలేదని అంతస్సు చెపుతోంది. తను భావిలో ఎప్పుడూ పారూకు కష్టం కలగకుండానే త్యాగం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ఈకోపంలో, పగలో పార్వతి తన్నా, వెంకటలక్ష్మినా ఆహుతిచేసుకునే దన్నదే సందేహంగా వుంది.

రోజులు గడుస్తున్నాయి. మిగిలిపోయిన అక్కడక్కడి చుట్టాలు పరామర్శకు వచ్చేరు. వీళ్లు రావడం అన్నది ఏ సంఘపు పెద్దమనుష్యులు నిర్ణయించిరోకాని మానవహృదయాల్ని వ్రక్కలుచేస్తోంది. ఆ అతీతానికి ఆదుకోలేకనే రెండుమూడుసార్లు తిట్టుకున్నాడు.

"సీతాయ్! మీబావది బోలెడంత ఆస్తి. దానిని బ్రతికున్నంతకాలమూ గడించి వదిలిపోయేడు. వెర్రిపిల్ల లక్ష్మికి దక్కనియ్యకుండా, వాళ్లవాళ్లు కాజేయకుండా చూడేం" అని ఆయన సలహా ఇచ్చేడు పరామర్శకు వచ్చి. వయస్సులో, ఒకఅనుభవంలో ఆయన పెద్దవాడు. ఇంతవరకూ దీని ఆలోచన సీతాయికి తోచలేదు. ప్రక్కగదిలోవున్న పారూకూడా ఇవి వినేవుంటుందన్న నిరుకు వుంది. ఈవిషయాన్ని ఆమె ఆలోచించిందో లేదో తెలియనేలేదు. ఇప్పుడు తను చెప్పడం సమంజసంగా వుంటుందో లేదో అని అడకత్తెరలో పడ్డాడు.

లాప్రకారం భర్తపాలు ఆమెకు సంక్రమించవలసిందే. తను దానికి ముందర కాలుదింపితేనేకాని రాదు అనీ తెలుసు. కాని అక్కగారి భావాలు ఎల్లా వున్నాయో తెలియటం లేదు.

ఆరోజు యాదాలాపంగానే దీని విషయం ఎత్తేడు. తోకత్రొక్కిన పాములాగే "ఆయన ఎంత మంచివారో నీకు తెలీనుదూ? కోర్టుముఖం పట్టి, ఆస్తికోసమని ఎల్లా నన్ను తిరగమంటావు! బ్రతికివున్నప్పుడు లేకపోయినా చచ్చినతర్వాత మమకారం ఎక్కువౌతుందా? ఆయనకు అక్కర్లేనిది ఇప్పుడు నాకొక్కవాలా? నీకంత ఆపేక్ష ఎందుకూ?" కసిరినట్టే అంది.

తెల్లబోయేడు సీతాయి. సర్వసాధారణంగా స్త్రీలోకానికి డబ్బన్నా, ఆస్తన్నా మమకారం ఉండకపోదని తన లోకానుభవం చెపుతోంది. ఇప్పుడు పార్వతి దుఃఖంలో వుండి అల్లా అని వుంటుందని ఊహించుకున్నాడు. కాలంగడిస్తే యథాప్రకారంగా తనంతట తానే ఆసంగతి ఎత్తి, ఏదో చెయ్యమంటుందన్న ధైర్యం వుంది. ఇప్పుడు ఈసమయంలో ఎందుకు ఆప్రసక్తి ఎత్తేనా అని కుళ్లిపోయేడు,

కాని లోపల్లోపల ఇల్లు చక్కబెట్టుకొనేసరికి ఊరు మాటుమణగదుకదా అన్న దుఃఖం లేకపోలేదు. ఈలోపునే మరదులు అంతా ఏకమై ఏం సృష్టిస్తారో అన్న అనుమానం కలిగింది. ఇప్పుడు తను ఏమీ చెయ్యలేడు. ఉమాపతికి ఈవిషయంలో ఉత్తరం వ్రాద్దామన్న మార్గం ఒక్కటే తట్టింది. ఆరాత్రి కూర్చుని ఉమాపతికి పెద్ద ఉత్తరం వ్రాసే నిద్రపోయేడు.

ఈ అంశం గడిచిన నాల్గురోజులవరకూ పిల్లిమీదా ఎలకమీదా పెట్టి డబ్బు, ఆస్తివిషయం ఎత్తిపాడవడం సీతాయికి కొరివితో తలగోక్కున్నట్టే అయింది. ఓరోజు రాత్రి వెంకటలక్ష్మి వచ్చి 'ఎందుకు ఆప్రసక్తి ఎత్తేరని' చాలా చెప్పింది. దీంతో మరీ దిగనారిపోయేడు.

*　　*　　*

రోజూ పదిగంటలకు ఆఫీసుకు వెళ్లడం సీతాయికి అలవాటు. ఇదివరకు వెంకటలక్ష్మి ఉడుకూ మడుకూ పప్పూఅన్నం పెట్టి పంపేది. కాని పార్వతి వచ్చినతర్వాత ఆ ఖంగారుభోజనంలో మార్పు జరగవలసివచ్చింది. మొదటిరోజుల్లో ఎల్లా వున్నా

నెల తిరక్కముందే "ఇంట్లో బోడిదాన్ని ఉన్నానుకా. ఇంక నా బ్రతుకే ముంది ఒంటింట్లో కాక?" అని అంటూనే ప్రభుత్వం పుచ్చుకుంది. పదిగంటలకు అన్నం ఉడకడమే బ్రహ్మాండమైపోయి, రోజూ ఆఫీసులో లేటుపడడం, సంజాయిషీ ఇచ్చుకోవడంతోనే సరిపోతోంది. చాటుగా ఓరాత్రి వెంకటలక్ష్మితో చెప్పేడు. "నేనేం చెయ్యనండీ? పూజలూ, పునస్కారాలూ మొదలుపెట్టేరు. మాట్లాడితే నేనే కయ్యమని 'పునిస్త్రీగా ఉంటే నన్నెవ్వరైనా అనేవారా? వెధవముండను అయ్యేనుకనుక ఈ ప్రారబ్ధం' అంటారు" అని చెప్పింది. ఇదివరకల్లా ఆఫీసరుగారి దృష్టిలో మంచిగా వున్నవాడు దిగనారుఅవడం కష్టంగా కన్పించింది. తనకు ఇంట్లో స్థలం లేనకట్టే ఆఫీసులో తిట్లూ తప్పవన్నట్టు తయారైంది.

పార్వతికి ఆరోజుల్లో కాస్త పడిశం పడితే "అక్కాయి, రోజూ స్నానాలు ఎందుకు? వెంకటలక్ష్మి చేస్తుంది వంట" అని అన్నాడు.

"అక్కగారిమీద ఆపేక్ష ఒలికిపోతోంది! ఆనాడు ఆయనకు చేసిపెట్టకపోయినా ఈనాడు నాకు తప్పదు. ఈమాత్రం చేసిపెట్టకపోతే నా తిండీ బట్టా నీకు దండగ అవదా!" అంది.

"అదేం మాట? నీకు కావలసినంత ఆస్తి వుంది, మహారాజులా జరుగుతుంది. ఎందుకక్కా అల్లా అంటావ్? నేనేం తప్పు మాట అన్నానా? ఒంట్లో ఆరోగ్యం సరిగా లేదని అంటున్నాను. అంతే" అన్నాడు ధైర్యం తెచ్చుకుని.

"నామీదా, నారోగంమీదా కాదన్నమాట నీ ఆపేక్ష. నాకున్న ఆస్తిమీద. ఇల్లా తగలేస్తే దబ్బున చస్తాగా, అప్పుడు నీకే వస్తుందిలే" అంది.

తింటున్న ముద్ద నోట్లోకి వెళ్ళలేదు. నిలువునా నిప్పులమీద కాల్చినట్టయింది. తన హృదయం ఎంత సాక్షిగా ఉంచుదామన్నా, అది వక్రమార్గులకు వక్రంగానే కన్పించి తనమీదే తిరుగుతోంది. తను అల్లా వుండడంకూడా తప్పేనా? తన అక్కే తన్నే ఇంత క్రూరంగా అంటోంది. గుడ్లమ్మట నీళ్లు తిరిగేయి.

మనసారా ఈ భారం తగ్గించుకుందుకైనా ఏడ్వాలి అనిపించింది. కాని వయస్సు ఒప్పుకోదు. తలుపు చాటున ఉన్న లక్ష్మి దిగాలుపడిపోయి, కళ్ళు తుడుచుకుంది. అది చూచే, తిన్నట్టు నటించి, చేయి కడుక్కుని వచ్చేడు.

గదిలోకి వచ్చిన లక్ష్మి కళ్ళల్లోకి బాధగా చూచి, ఆఫీసుకు వెళ్లేడు. ఆరాత్రి లక్ష్మి "నా తమ్ముడు నాకు పెడితేనే డబ్బు ఖర్చు అవుతోందని బెంగపెట్టుకుని అన్నం కూడా తినకుండా వెళ్లేడు. నా ఆస్తికోసం తమ్ముడు నాకు ఆదరం ఇచ్చేడుకాని, మరో అందుకా......" అనేవరసలో సణిగిందని చెప్పింది.

ఏంచెయ్యాలో తెలియటం లేదు పార్వతిని. తన కున్న జ్ఞాపకంలో, వెనుకటి సంగతులు మననంచేసుకుంటే చిన్నపుడు చేసిన మంకుతనం, అల్లరి, పెంకి గడుసుతనం జ్ఞాపకం ఉన్నాయి. పెద్దయినతర్వాత కూడా, భర్తని చేతుల్లో పెట్టుకొని మగనాలిగా చేసుకుందని విన్నాడు. ఆ అధికారం భరించలేకనే ఆయన చచ్చేడేమో అని కూడా అనుకోవడం విన్నాడు. ఆ జీవనాలు ఎల్లా వున్నా ఇప్పటి స్థితిలో పార్వతిలో ఎల్లా మార్పు వస్తుందా అన్నదే సమస్య అయింది. ఇది తప్పు, ఇది ఒప్పు అనికూడా చెప్పలేనంత అధైర్యం, భయంలో పడ్డాడు.

ఏరోజు ఇంట్లో కాలు పెట్టిందో ఆరోజునుండి లోపల సమస్య పెరుగుతూనే వుంది. అది రోజు రోజుకూ ఎక్కువయ్యే సన్నివేశాలు వస్తున్నాయి. వచ్చిన మొదటిరోజునే, ఎంత చెప్పకూడదనుకున్నా, "లక్ష్మి! నాకోసం కొన్నాళ్ళు నువ్వు బాధపడాలి" అని చెప్పి, లక్ష్మిని పార్వతికి బానిసగానే చేసేడు ఆ అదను చూచుకుని పార్వతి చేసే హయాములు తనకే కాలుమంటలు పెట్టినట్టయ్యేయి.

ఆ శెలవులకు సీతాయిబావమరిది - స్కూల్ ఫైనల్ చదువుకుంటున్న రామం వచ్చేడు. రాకరాక వచ్చేడని వెంకటలక్ష్మి మొదటి రెండురోజుల్లోనూ ఏవేవో కబుర్లు చెప్పుకోవడం, ఉదయం సాయంత్రం కాస్త ఫలహారాల్లోనూ సరిపుచ్చుకుంది. ఆ రెండు

రోజుల్లోనూ లక్ష్మికి సగం బలం వచ్చినట్టే అయింది. దీనికి సీతాయి సంబరపడ్డాడు. ఆరోజు భోజనాలదగ్గర కూర్చున్నపుడే "బావా! ఈమె ఎవరు?" అని అడిగేడు.

ఉలిక్కిపడ్డాడు సీతాయి. ఇంతవరకూ అతను తనింటికి ఎప్పుడూ రాలేదు. పెళ్లిలో ఎప్పుడో చూచేడు అంతే... "ఆవిడ మా అ..." అన బోయాడో లేదో, నేయి వడ్డిస్తున్న పార్వతి అందుకున్నట్లుగానే "నేనా అమ్మా! పిల్లింట్లో వంటలక్కని" అంది.

పేగులు తోడేసిన ట్టయింది. సీతాయి కుమిలింపులో అక్కగారి మొఖం చూచేడు. ఆవిడకళ్ళు విజయసూచకంగానే కనపడ్డాయి. ఎందులో విజయమో అర్థంకాలేదు. ఎందుకు తనమీదా, లక్ష్మిమీదా కక్ష! తను ఏంచేసేడు? పూర్వజన్మంలోని పాపఫలమా? మాట్లాడలేకనే తల వంచుకున్నాడు.

"ఏం నాయినా! చేసినవన్నీ సరిగా వున్నాయా? నీ కేది ఇష్టమో అది చెప్పు. చేసి పెడతా!" అడగకుండానే కూర వేసి పార్వతి అంది.

రామం పూర్ణంగా సిగ్గుపడిపోయేడు. సీతాయికీ, లక్ష్మికీ గొంతుకలో వెలక్కాయ పడినట్లయింది. పార్వతిమనస్సు ఏమైనా చెడిందా అనిపించింది సీతాయికి. ఆ భోజనందగ్గర రామాన్ని సిగ్గుతో తలవంచుకు నేట్లు చేసింది పార్వతి. ఇంత ఆదరం వున్న మనిషిలో ఈ వెలుగునీడలు ఏమిటో అర్థంకాలేదు.

రామం వున్న రోజులన్నిటిలోనూ అతని సపర్యలన్నీ పార్వతే చేసింది. చిన్నవాళ్లకు తీపి అంటే ఇష్టమని మైసూరుపాక్, జిలేబీ, గులాబ్ జామ్‌లు చేసింది. కాఫీ వడపోస్తే బాగోదని ఫిల్టరులో వేయించింది. ఆ శనివారంనాడు మంచిదని తలంటి నీళ్ళు పోయించింది. ఆరోజే సీతాయి ఆఫీసుకు వెళ్లుతుంటే "రాకరాక ఆ అబ్బాయి వచ్చేడు. క్రొత్త చొక్కా, లాగూ కుట్టించరా" అని చెప్పింది. ఈసలహా వింటున్నప్పుడు సీతాయి ఉల్లాసీదా అయ్యేడు. పార్వతికి మర్యాదలన్నీ తెలుసుండే ఇల్లా ఒక్కొక్కప్పుడు ఎందుకు ప్రవర్తిస్తుందని! ఆ రెండుమూడు రోజుల్లోనూ నాల్గయిదుసార్లు కుట్టువాడు బట్టలు ఇచ్చేడా అని తెచ్చేవరకూ నిలవనిచ్చింది కాదు.

ఆరోజు బట్టలు తొడిగించి, "ఏం నాయినా! నీపెళ్ళికి నన్ను పిలుస్తావా?", అని పరిహాసంకూడా ఆడింది. వెంకటలక్ష్మి ఇది వర్షానికిముందర వీచే గాలేమో అనుకుంది. ఓపెడ సంతోషం, రెండవవైపు భయంతోనే మెసిలింది.

ఆ ఆదివారంనాడు రామం పెట్టే బేడా సర్దుకుని, బండి ఎక్కినప్పుడు, పార్వతి గోడకు జార్లపడి గుడ్లమ్మట నీళ్ళు కక్కుకుంది. అందులో ఆవయస్సుకు సంతతే కల్గివుంటే, రామంఅంత చెయ్యికందిన కొడుకు వుండేవాడుగదా అన్న బాధ ద్యోతకమయింది. పార్వతి కళ్ళు ఒత్తుకుని లోపలికి వెళ్లడం చూచిన దంపతులిరువురికి అచేతనంగానే అనునయం, జాలీ కలిగించి, నిజంగా పార్వతిజీవనం కిరాతనీయమే అయింది. అంతవరకూ పిల్లలు కలగనేలేదు. ఇప్పుడు ఈస్థితిలో, పిల్లలు వుంటే అన్న మమకారం పోనట్టుకోలేదు. అది విజృంభిస్తూనే వుంటుంది.

ముప్పైఅయిదువత్సరాల్లో వున్న పార్వతి అటు దాంపత్యసుఖం, సంతతిప్రేమా లేకుండానే విధి క్రూరంగా విధించేడు. పైగా ఆ దాంపత్యంకూడా ఎగుడుదిగుడుగానే గడిచింది. అందులో సుఖం పడకుండానే, తను లోపల్లోపల ఆరాధించుకున్న ఉమాపతితోబాటు భర్తకూడా దూరమైపోయేడు.

ఇప్పుడో ఏకాకి. పరువుప్రతిష్ఠా భంగంచేసుకోలేక, తమ్ముని ఒడిలో తలదాచుకుంది. ఇన్నిదుఃఖాల ఫలితమే ఆ అకాలవిజృంభణలు అని సీతాయికీ, లక్ష్మికీకూడా తట్టింది. చెమ్మగిల్లిన కళ్ళతోనే ఇరువురూ లోపలికి వెళ్ళేరు. వంటింట్లోంచి వెక్కివెక్కి ఏడ్వడం, దుఃఖం మూర్తీభవించి, వీథికి ఎదురుతిరిగిన అనాథగొంతు ఆవేదనా విన్పించింది. లక్ష్మిని దగ్గరసా అనునయంచేస్తూనే, ఉబుకుతున్న కన్నీళ్ళు పమిటలో ఇంకించేడు సీతాయి.

*    *    *

ఆ డిశెంబర్లో పార్వతిపూరినుంచి రైతులు వచ్చేరు. వాళ్లందరిదగ్గరా పార్వతి ఇదివరలో శిస్తులు పుచ్చుకుంది. కాని ఈనాడు వాళ్ళు శిస్తులు పట్టుకు రాలేదు. చాడీలు చెప్పటకే వచ్చేరు. ఈ ఏడు చేనిమీద పంట కొయ్యనియ్యలేదట. "మాది అవిభక్త కుటుంబం. మొత్తంఅంతా చూచుకుని, అందులో మాఅన్నయ్యపాలుకు ఏమి వస్తుందో అది మేమే పంపిస్తాం" అని అటకాయించేరని చెప్పేరు.

తలుపుచాటునుండి పార్వతి అంతా విన్నది. సీతాయి ఈసంగతి ఎప్పుడో అప్పుడు జరుగుతుందని ఆశించేడు. తన ఆఫీసుకు ఆవూరి నుండీ వచ్చే పెద్ద మనుష్యులు చాటుగామాటుగా ఇంకా ఎన్నో చెప్పేరు. కాని పరిస్థితి తనకు స్వతంత్రం ఇవ్వలేనందునే మాట్లాడక ఊరుకోవలసివచ్చింది. తన బావగారి ఇత్తడి సామానూ, ఆ మండువాలోగిలిలో వున్న వాటాలో యావత్తూకూడా, ఎవరికి దొరికినది వారు స్వాధీనం చేసుకొన్నారనికూడా విన్నాడు. పార్వతికి ఇప్పుడు తెలిసింది. ఆచెప్పడంలో రైతులు అన్నీకూడా చెప్పేరు.

పార్వతి ఇప్పటికైనా అసలువిషయం అవగాహనచేసుకొని సక్రమంగా ప్రవర్తిస్తుందని ఆశించేడు. ఏం చెపుతుందో అన్న ఆలోచనా కలిగింది.

"వెళ్ళండి వెంకన్నా. ఆ కరణంబావగారు ఎల్లా చేయిస్తే అల్లాగే చెయ్యండి" అంది శాంతంగా. రైతులూ, సీతాయీకూడా తెల్లబోయేరు, పార్వతమ్మ ఇల్లా అన్నందుకు.

"ఏమండీ అమ్మగారూ, నిక్షేపంలాంటి ఆస్తి. ఇల్లా ఈ నక్కలపాలు చెయ్యమన్నారా? మీకు ఒక్క సెంటు భూమికూడా దక్కకుండా చేస్తారు. అల్లా అంటే ఎల్లాగండీ!"

"వెంకన్నా, నేను మాఅత్తవారింటికి వచ్చినపుడు ఆస్తికోసం రాలేదు. నాఆస్తి అన్నది నాకేముంది? ఆయనే లేనప్పుడు, ఇంకా ఆ ఆస్తులూ అవీన్నా నాకెందుకూ?"

వెంకన్నకు సమాధానం తోచలేదు. సీతాయికి ఈవేదాంతం అర్థం కాలేదు. ఏకారణాలచేత, కనీసం తన పోషణకైనా చూచుకోకుండా, ఇల్లా జోరుగాలిలో దీపంపెట్టి, దేవుడా నీమహత్యం అంటోందో తెలియటం లేదు. భర్త చనిపోయేటప్పుడు ఏమైనా వీలునామా వ్రాసేడా అంటే దాన్నిగురించి తను వినలేదు. ఆస్తికొరకు తగవు లేవా పెట్టుకోను అని ఆయన పార్వతిచేత వాగ్దానం ఏమైనా చేయించుకొన్నాడేమో పరమాత్మునికే తెలియాలి అనుకుని ఊరుకున్నాడు.

మెట్లు దిగుతూనే "సీతారామయ్యగారూ! అమ్మగారికి మీరేనా చెప్పండి! అంత వెర్రిబాగులుగా వూరుకుంటే ఎల్లాగండీ" అంటూనే వెంకన్న అడుగులు వేసేడు. ఈ ఆఖరువాక్యాలు పార్వతి వింది.

"నాకు ఒకళ్లు చెప్పనక్కర్లేదు. అంత అవసరం వస్తే నేనే చూచుకుంటాను." అంటూనే వంటింట్లోకి వెళ్లింది.

భర్తఆత్మశాంతికోసం, ఆయన గౌరవంకొరకు నీచడబ్బుకోసం కోర్టులు ఎక్కడం ఎందుకు అన్న భావనలో పార్వతి వెర్రిగా ఉండిపోయిందేమో అనిపించింది సీతాయికి.

ఆరాత్రి కూర్చుని ఉమాపతికి పెద్ద ఉత్తరం వ్రాసేడు. "పార్వతి మారింది. అందులో నన్ను ద్వేషించడంతోనే సరిపుచ్చుకుంటోంది. ఆమెభావికోసం అయినా ఆస్తివిషయం ఆలోచించటం లేదు. కనీసం నువ్వేనా ఓసారి వచ్చి చెప్పితే వింటుందన్న ధైర్యం వుంది. బావా! తప్పకుండా రా! నీమాట జవదాటదు. కనీసం నాకోసం కాకపోయినా, పార్వతికోసం అయినా రా" అని అంతం చేసేడు.

పోస్టులో వేసినప్పుడు "ఒస్తే బావుండును. దేవా! కనికరించు" అని మనస్సులో ప్రార్థించి మరీ వేసేడు.

* * *

అనుకోకుండానే ఆ మూడోరోజున ఉమాపతి వద్దనుండి ఉత్తరం వచ్చింది. ఎక్కువగా ఏవిషయం

వ్రాయకుండానే ఊళ్ళమ్మట తిరుగుతున్నాను. నువ్వు చెప్పినవిషయంలో ఇప్పుడు ఏమీ వ్రాయలేను. కొద్ది రోజుల్లో వస్తాను అనిమాత్రమే వ్రాసేడు. సీతాయికి ఆవుత్తరం కొంత అనునయం ఇచ్చినా, ఎప్పుడు వస్తాడో అన్న ఆత్రుత ఎక్కువైంది.

ఆరోజు కొంత శాంతితోనే ఇంటికి వచ్చేడు. రోజూ గుమ్మంమెట్లు ఎక్కేటప్పటికి ఏం విపరీతపు మాటలు వినవల్సివస్తుందో అనే ఎక్కేవాడు. ఈరోజూ ఆ బెదురుతోనే అడుగులు వేసేడు. ఎదురుగా పార్వతి ఒస్తూనే "ఒరే! సీతాయ్. ఇంకా నీకు తెలియదురా? లక్ష్మికి ఐదవమాసం. నాకు ఇంతవరకూ తెలియనే లేదు. రేపు వాళ్లమ్మకు ఉత్తరం వ్రాయి" అని సంబరపడి చెప్పేసింది.

అంత సంతోషంతో ఇంతవరకూ ఎప్పుడూ పార్వతినోటంబడి మాట వినివుండలేదు. లక్ష్మి ఇది వరకూ రహస్యంగా సిగ్గుపడుతూ, గునుస్తూనే చెప్పింది. కాని దాన్ని ఇరువురిమధ్యనే దాచుకున్నారు. అదే ఓవేళ బయటపెట్టివుంటే పార్వతి అస్తమానం ఏదో మాట అంటుందేమో అని భయపడ్డారు.

పార్వతే ఆవిషయం ఈవిధంగా తీసుకుంటుం దని ఎప్పుడూ అనుకోలేదు. హృదయం ఓసారి ఎగిరి పడింది. "అల్లాగా అక్కయ్యా! రేపు వ్రాస్తాలే... కాని..." నసికేడు తనే తన అత్తగారికి ఈవిషయం ఎల్లా వ్రాయడం అన్న భావంతో. నవ్వింది పార్వతి, గ్రహించినట్టే. "నేను వ్రాసినట్టు వ్రాయరా" అని లోపలికి అడుగు మళ్ళిస్తూనే "పాపం, వెర్రిపిల్ల! ఇవ్వా ళంతా ఆ నాల్గుకుంచాల కందులు విసిరింది. అలసి పోయింది. చెప్తితే చెయ్యనిస్తానురా? నీకు ఫ్లాస్కులో కాఫీ పోసివుంచేను" అని అంటూ వెళ్ళింది.

అందులోని మార్దవానికి సీతాయి హృదయానికి జోలపాట పాడినట్టే అయింది. ఆనందంగానే అడు గులు వేసేడు. ఇన్నాళ్లూ మానసికంగా అనుభవించిన ఆవేదన ఒకుఎత్తు; ఇప్పుడు ఈ క్షణంనుండి మారిన నూతనజీవనం మరో ఎత్తు అనుకొంటూనే కోటు విప్పి కాఫీ తాగేడు.

తనూ, లక్ష్మి కాపురానికి వచ్చిన రెండో వత్స రంనుంచీ సంతతికోరకు ఆశించేరు. ఆరు వత్సరాల వరకూ దేవుడు దయతలచనేలేదు. తన హృదయంలో కోర్కె జీవం పోస్తోందన్న వార్త తెలిసినప్పటినుంచీ తనకు అదృష్టపురోజులు తిరిగేయనుకుని సంబరపడ్డాడు. ఈరోజు దాన్నిలోపల్లోపలే దాచుకోనక్కరలేకుండా పాలు పంచుకోడానికి పార్వతికూడా చేరింది అనే సరికి తేలికపడింది.

ఆ మర్నాడు, ఉదయమే కాఫీ తెస్తూనే, "ఏరా ఉత్తరం వ్రాసేవా?" అని పార్వతి అడిగింది. అడగడమే కాదు. దగ్గర కూర్చుని, వ్రాయించి, కవర్లో పెట్టి, పోస్టుచేసేవరకూ కూడా వదిలిపెట్టలేదు. ఎప్పుడూ అంతవరకూ లేనిది, సీతాయినీ లక్ష్మినీ, ఒకే పంక్తిని కూర్చోపెట్టి ఒడ్డించింది. లక్ష్మి ఎంగిలికంచాలు తియ్యబోతూంటే "ఒద్దు, నేను తీస్తా, నువ్వు వాడిని ఆఫీసుకు పంపిద్దూ" అని వారించింది పార్వతి.

గదిలోకి సిగ్గుపడుతూవచ్చిన లక్ష్మిని దగ్గరగా తీసుకుంటూనే "లక్ష్మి, పార్వతి మారింది. ఇదంతా నీవల్లే కాదూ" అన్నాడు. గునిసింది లక్ష్మి. సిగ్గుపడి పోయింది. బుగ్గలమీద చిటికవేసి కోటు తొడు క్కొని మెట్లు దిగేడు.

ఆరోజు మొదలుకొని దంపతులిరువురి దినచర్య ల్లోనూ మార్పు వచ్చింది. అసలు లక్ష్మిని ఒక్కపని చెయ్యనివ్వటం లేదు. ఇన్నాళ్లూ పార్వతి ఏదో ఒకటి అనకుండా చేయనిపని ఈ రోజుల్లో తనంతటతానే పూనుకొని చేస్తోంది. లక్ష్మిని భోజనం, కాఫీ సమ యానికి తీసుకోవడం తప్ప మరోపని చెయ్యనిచ్చేది కాదు. చేస్తే అలసిపోతుందన్న మాటే పట్టుకుని పార్వతి అస్తమానం చెప్పడం, తనే చెయ్యడంతోటే సరిపోయింది. లేస్తే అలసిపోతుంది, కూర్చుంటే అలసి పోతుంది అన్న భావనతోనే, పార్వతి లక్ష్మిని చూడ్డంతో తీరుబడే లేకపోయింది.

సీతాయిలోకూడా మార్పువచ్చింది. ఇదివరలో ఆఫీసుకు ఆలస్యంగా హాజరుమార్కు వెయ్యడంతప్పింది. ఆరోజుల్లో రోజూ బజారునుండి ఏదో తెమ్మని చెప్పే పురమాయింపులు పార్వతివల్ల ఎక్కువయ్యేయి. బలానికి

మందు ఇప్పించాలని డాక్టరువద్దకు ఓసారో రెండు దఫాలో తీసుకువెళ్ళింది.

పార్వతిలో ఈ మార్పుకు సీతాయికి ఒక్కటే కారణం కనిపించింది. అందులో ఆనాడు రామం వచ్చివెళ్లడం, పార్వతి పడ్డ ఆవేదన - వీటి ఫలితమే ఈనాడు రూపొందిన మార్పుకు కారణం అనుకున్నాడు. తనజీవితంలో తనకు పిల్లలు ఎల్లాగా దైవం వ్రాసిపెట్టలేదు. ఏకోదరుడయిన తమ్మునికేనా సంతతి కల్గుతోంది. వాళ్ళ ఆటపాటల్లో కాలం గడుపుకో వచ్చు అన్న అనునయంతోనే, వెంకటలక్ష్మికి ఇంతగా మాతృస్థానం వహించిందని సంబరపడ్డాడు.

ఈగడుస్తున్న రోజులలో పార్వతిమీద భక్తి గౌరవాలు ఏర్పడ్డాయి అటు లక్ష్మికీ, ఇటు సీతాయికీ కూడా. అక్కడ చెంబుతీసి ఇక్కడ పెట్టనివ్వక పోవడం, తనకి ప్రతీక్షణంలోనూ ఏడుగడలా చూడ్డం, అన్ని సపర్యలూ చేయడంతో పార్వతి అంటే, తన లేని అత్తగారిస్థలంలో అవతరించి, అన్నపూర్ణహస్తం చూపించుటకే వచ్చిందనుకొని, జరిగిన గడ్డుదినాలన్నీ తను ఎల్లాంటి మనిషో పరీక్షించుటకే అనుకుంది.

రోజూ భర్తకి చెప్పేది-ఇవ్వాళ ఇల్లా జరిగింది, అల్లా జరిగిందని. సీతాయి అనునయంగానే ఆనంద పడేవాడు త్వరలో పితృస్థానం వహించబోతున్నందుకు. వంశం నిలబెట్టుటకు సంతతి ఉదయిస్తోంది; గృహలక్ష్మి అనే ఆరాధనలోనే లక్ష్మిని పువ్వుల్లో పెట్టే వాడు. తమ్ముడు రోజూ ఏదో చాటుగా తెచ్చి, లక్ష్మికి పెట్టుతూవుండడం, వాళ్లు చిలకాగోరింకల్లా వుండడంతో పార్వతికి ఏదో నూతనజన్మ ఎత్తినట్టే వుండేది.

తన జీవితంలో కొన్నాళ్ళు భర్తతో సంతృప్తిగానే కాలం గడిపింది. అవన్నీ ఇప్పుడు స్ఫురణకు మాత్రమే. అవి జరిగిపోయేయి. వానిని పూర్ణవయస్సులో పూర్తిగా ఆరాధన చెయ్యడానికి దేవుడు ఆజ్ఞ ఇవ్వలేదు. కాని ఈనాడు తన జవసత్తువలు ఆనందం ఏకరక్తంలోంచి వచ్చిన దానికి ధారపోయడం కంటె, వాళ్లు ఆనందంగా, తనయెడ గౌరవంగా, భక్తితో, భయంతో ఉండడంకంటె ఇంకేమీ లేదన్న భావనలోనే మెసలడం మొదలెట్టింది పార్వతి.

అప్పుడప్పుడు తన జీవితంలో తన్ను 'అమ్మ' అని నోరారగా పిలిచేవారు లేరు; వచ్చినా వాళ్ళు అప్పుడే వెళ్లిపోయేరు అనే తలంపు వచ్చినప్పుడు, దుఃఖం వచ్చేది. కాని లోపల్లోపల-దత్తత చేసుకుంటే కనీసం వాడైనా పిలుస్తాడన్న ఆవేదన కల్గేది. తను చచ్చిపోతే శ్రాద్ధం అయినా పెట్టేవాడు వుండవద్దా అనిపించేది.

ఓవేళ దత్తతే నిర్ణయించుకుందామంటే, ఎవరు ఇస్తారు! తనకు దగ్గరబంధువుల్లో ఎవరూ ఇచ్చేవారు కూడా లేనేలేరు. ఇవ్వడానికి ఒప్పుకున్నా, తను అడగలేని పౌరుషం వెనక్కు లాగుతోంది. ఈ సమయంలో ఒక్క తన తమ్ముడి తరఫువారికంటె తక్కిన ముఖ్యులు లేరు. తన తమ్ముడికే రేపు పిల్లలు కలిగితే, వాడ్ని అడిగినా, తనమాట తీసివెయ్యడన్న ధైర్యం వుంది. ఆ తలంపే లక్ష్మి నిండు మనిషిఅని తెలిసినప్పటినుండీ పార్వతిలో ఎక్కువైంది.

ఈ ఆశతో అప్పుడప్పుడు తన వయస్సు సింహావలోకనం చేసుకున్నట్టే ఉండేది. లక్ష్మికంటె తను ఐదు ఆరు ఏండ్లు పెద్ద. ఆయన వున్నట్టయితే అప్పటికే తనకు పిల్లల ఆశ ఉడిగిపోయేదికాదు. కాని ఇప్పుడో? దుఃఖం వచ్చేది. చచ్చినవాళ్లు చావకుండా, బ్రతికున్న వాళ్లనుకూడా ఎంత క్రూరంగా శిక్షించి వదులుతారో అని తిట్టుకుంది. తనబ్రతుకే అల్లా అయింది.

ఆరోజు భోజనాలదగ్గర "ఒరే, సీతాయి! జనవరినెల వస్తోంది. రైతులు ఒక్కపైసా శిస్తు ఇవ్వలేదు. వెంకన్న దొంగముండావాడు. వాళ్లకు ఓసారి ఉత్తరాలు వ్రాయిరా; డబ్బు నిక్కచ్చిగా వుం"దని అంది.

సహపంక్తిని కూర్చున్న సీతాయీ, లక్ష్మికూడా తెల్లబోయేరు. ఆ క్షణంలో, సీతాయికి, తన అక్క తెలివితేటలు, సమయాసమయాలు చర్చించి, నిర్ణయానికి రావడానికీ, ఇవన్నీ అర్థం చేసుకోడానికీ తను ఇంకో జన్మ ఎత్తాలేమో అనిపించింది. బావగారు పోయిన వెంటనే ఆస్తివిషయం ఎత్తి విరోధం తెచ్చుకోవడం

ఎందుకని శాంతించి ఇన్నాళ్లకు నిర్ణయానికి వచ్చింది కాబోలు అనుకుని ఆశ్చర్యపడ్డాడు.

"రేపు పెద్దబావగారికి ఓ ఉత్తరం వ్రాయాలి. ఇన్నాళ్లనుండి వ్రాయిద్దామనుకున్నా, బాగుండదేమో అని వూరుకున్నా."

"అల్లాగే అక్కాయి" అని అనగలిగేడు.

"ఆ, మరిచేపోయా! లక్ష్మికి కట్టుకునేందుకు తేలికచీరలు, గ్లాస్కోవి, తెచ్చిపెట్టు రేపు. డబ్బు కిస్తు వొచ్చింతర్వాత ఇద్దాం" అని పురమాయించింది.

ఆ రాత్రి దంపతులిద్దరికీ నిద్రలేకనే పోయింది. పార్వతిని ఇద్దరూకూడా ఎంత తెలివితక్కువగా అర్థం చేసుకున్నారో అనీ, ఈనాటి చర్యలను మననం చేస్తూనే చెప్పుకున్నారు.

అన్నట్టుగా ఆమర్నాడు రైతులందరికీ ఉత్తరాలు వ్రాయించింది. వారంపదిరోజులు చూచి ఉత్తరాలు రాకపోతే పునఃరిజిస్టరీ ఉత్తరాలు కట్టించింది. బావ గారికి అతిమర్యాదగానే, తన్ను పోషించడంలో ఆయనకు బాధ్యత వుందనీ, ఏకాకికి ఓమార్గం చూపించడంలో ఎప్పుడూ వెనక్కు తియ్యరనీ— ఆవరసలోనే వ్రాయించింది.

ఇది వ్రాసిన పదిరోజుల్లోపలే "అమ్మాయీ! అందరం కలసి ఏదో ఓనిర్ణయమార్గానికి రావడం మంచిది. ఎప్పుడూ మనవంశం కోర్టులకు ఎక్కడం తాతల దగ్గర నుండి లేదు. కొద్దిరోజులలో ఏదో విధమైన భాగాలు చేసి తెలియపరుస్తాను" అని వ్రాస్తూనే, అంతవరకూ నీ ఖర్చులకు ఉంచుకోమన్నట్టు ఐదువందలు పంపేడు.

ఉత్తరం, డబ్బూ చూచేసరికి సీతాయికి తను ఎక్కడ వున్నాడో తెలియలేదు. అంతవరకూ ఈ వ్యవహారం ఫైసలు అవడానికి కోర్టుకు ఎక్కితేగాని తేలదన్న దృష్టిలోనే వున్నాడు. ఒక్క తన అక్క గారి వినయవిధేయతఉత్తరంతో, పెద్దబావగారు, ఇంత త్రుటికాలంలో తేలుస్తారని అనుకోలేదు.

తన భర్త స్వార్జితంగా సంపాదించిన భూమి రైతులు రిజిస్టరీ ఉత్తరాలు పుచ్చుకోకుండానే త్రిప్పివేసేరు. వెంటనే ఒచ్చి 'పెద్దబాబుగారు వెంటనే వెళ్లమన్నారండి' అని చెప్పి, శిస్తు అణాపైసల్తో జమ కట్టేరు.

డబ్బు చేతిలోకి వచ్చినంతనే లక్ష్మిని తీసుకుని పార్వతి బజారుకు వెళ్లి 'ఇంట్లో ఇది లేదు అది లేదు. అన్నీ వుండాలి' అని చెపుతూనే బండెడు సామాను కొనుక్కువచ్చింది. అందులో నేతిగరిటె దగ్గరనుండి ఇత్తడినల పాత్రవరకూ వున్నాయి. లక్ష్మికి బావుంటుందని, ఆరుద్రపురుగురంగుపట్టుచీరా, దానిమీదికి పచ్చటి జాకెట్టుగుడ్డా కొంది.

ఆఫీసునుండి సీతాయి వచ్చేసరికి సావిటినిండా పేర్చివున్న సరుకులు చూసి, ఏమనాలో తెలియలేక పోయింది. తల్లీ, తండ్రీ పోయినతర్వాత, తనకు నా అన్నవారు లేకే, ఏకాకిని అయ్యేనుగదా అనుకుని వ్యథ పడ్డ రోజులు ఉన్నాయి. ఈనాడు తన అక్కగారు తనకు ఏకుగడగా ఒకరున్నారు అని చూపించినందుకు భగవంతుణ్ణి అభినందించుకున్నాడు. తన కృతజ్ఞత పైకి ఏవిధంగా చూపాలో తెలియలేదు. కొన్నాళ్లు పొందిన ఆవేదన, దాన్ని పైకి పొక్కనివ్వకుండానే, లోపల్లోపలే అణిచి వూరుకోబెట్టింది.

కోటు విప్పి "అక్కా! ఇవ్వాళ ఉమాపతి బావ ఉత్తరం వ్రాశేడు. వారం పదిరోజుల్లో ఇక్కడకు వస్తాడుట. వంట్లో బాగాలేదట. ఇక్కడ మందు తింటాడుట" అన్నాడు.

క్షణంపాటు పార్వతి గోడకు జేర్లబడిపోయింది. సీతాయికి ఆశించిన సమాధానం రాకపోయింది. ఆ క్షణంలో పార్వతి అల్లాఅవుటకు కారణాలు ఊహించు దామన్నా తనకు అతీతంగానే ఉన్నాయి.

"మంచిదే!" అని చెప్పి లోపలికి వెళ్లిపోయింది. ఆశబ్దంలో ఎన్నో గోచరించేయి. ఉమాపతి రావడంలో పార్వతికి బాధ ఎక్కువేకాని, ఇంకొక విధంగా శాంతి లేదు. ఒకానొక కాలంలో అతను తనభర్త అవుతాడని ఆశించి చకోరి అయింది. కాని విధి క్రూరంగా ఆశలు మార్చింది. ఈ వైధవ్యంలో అతనే కళ్లెదురుగా తిరుగుతుంటే బాధ భరించుకోవడం

కష్టమే. ఎర్రటి పుండు మీద కారం చల్లినట్టే వుంటుంది.

తను, పోనీ, ఉమాపతికి రావద్దు అని వ్రాద్దామంటే, ధైర్యం చాలటంలేదు. 'దేశాటనంవల్ల చెడిన ఆరోగ్యం బాగుచేయించుకుందుకు వస్తున్నా. నీకు ఇప్పుడు బాధ కల్గిస్తున్నా. దాన్ని నువ్వు సహృదయంతోనే తీసుకుంటావని తలుస్తాను' అనే వ్రాసేడు. తను కాదు అని వ్రాయలేడు. పైగా తన ఉద్యోగం కొరకు ఎంతో సహాయం చేసేడు. అల్లాంటప్పుడు, తన విధి, అతన్ని సంతోషపరచడంకన్న ఇంకేమీ లేనట్టే కనబడింది.

లక్ష్మితో చెప్పేడు. ఏం చెయ్యమన్నావు అనికూడా అడిగేడు. ఆమె ఏం చెప్పలేక 'ఇరకున పడ్డాం' అని అంది.

ఓరోజు ఉమాపతి వచ్చి, ఈ సరిపడని సంగతులకు ఓమార్గం కలగజేస్తాడని ఎదురుచూచేడు. కాని ఈనాడు అతను రాకుండావుంటేనే బావుండును అన్న ఆశ ఎక్కువైంది. కాని ఒక్క ధైర్యం వుంది. మొదట్లో పార్వతి ఎల్లా వున్నా, ఇప్పుడు ఆమె లేకపోతే అన్న భావన అందరిలోనూ కలగజేసింది. రామం ఆమె ఆతిథ్యం పొందిన రోజులు తక్కువైనా ప్రతీఉత్తరంలోనూ ఆమెకి వందనాలు చెప్పవలసిందని వ్రాస్తూనే వున్నాడు. విశాలహృదయంతో, కష్టం కల్గినా, పార్వతి ఉమాపతిని సరిపుచ్చుకోగలదన్న ధీమాయే, ఇదమిత్థం తేల్చకుండా సీతాయిని ఊరుకోబెట్టింది.

ఏదో ఓరోజున 'ఉమాపతి ఎప్పుడు వస్తా'డని పార్వతి అడుగుతుం దనుకున్నాడు. కాని ఉమాపతి ఉత్తరం వచ్చినప్పటినుంచి పార్వతిలో ఓవిధమైన మూగతనం కనిపించింది. ఏదో ఆలోచిస్తోందన్న భావన స్ఫురింపజేసింది. పైగా లక్ష్మి "వదినగారు నాలుగైదుసార్లు ఎందుకో గుడ్లమ్మట నీళ్ళు కుక్కుకున్నారు. ఎంత అడిగినా చెప్పేరు కారు" అని చెప్పింది.

ఆరోజు స్టేషనుకు వెళ్లేడు. ఆరైలులో ఉమాపతిని దిగుతుండగా చూచేసరికి సీతాయికే అనుమానం కలిగింది. అతను ఉమాపతేనా ? కి దగ్గరగా వెళ్లేడు.

"సీతాయి !"

ఆ మారిన కంఠం, ఎముకల పోగుగా వున్న రూపూ చూడలేక, దుఃఖంలోనే కావలించుకున్నాడు..."బావా ! ఎంతగా మారిపోయేవ్ ! ఇంత ఎక్కువగా వుందని ఒక్క వుత్తరం వ్రాయలేకపోయేవా? నేనేనా ఒచ్చి తీసుకువచ్చేవాడిని".

నవ్వేడు ఉమాపతి. "పారూ, లక్ష్మి కులాసాగా వున్నారా?"

తలూపేడు. భుజానికి ఆనుకుంటూనే బండి ఎక్కేరు. అలసిన లక్షణాలు ఉమాపతిలో కన్పించేయి. "సీతాయి ! ఉత్తరం వ్రాయలేదన్నావుకదూ ? ఏమని వ్రాయను? స్వార్థంలేకుండా సేవచెయ్యడం తప్పేమో అనిపిస్తుంది. ఆనాటినుండి పల్లెటూళ్లల్లో తిరుగుతున్నా. ఓ బడికూడా పెట్టేను. కాని..." చెప్పలేక ఆయాసపడ్డాడు.

"తర్వాత చెపుదువుగానిలే బావా!"

ఇంటికి వెళ్లేసరికి పారూ గుమ్మంలో నుంచుని ఉంటుందని సీతాయి వూహించుకున్నాడు. కాని అది నీటిమీద వ్రాత అయింది. జెబ్బపట్టుకుని లోపలికి నడిపించుకుంటూనే వెళ్లి సావిట్లో కూర్చోపెట్టేడు.

"లక్ష్మి ! వేగరంగా కాఫీ తీసుకురా !" అని ఆ ఖంగారులో పొలికేక వేసినట్టే వేసేడు. లక్ష్మి ఖంగారుపడింది. ఏం తొందర వచ్చిందో అని ఆదరాబాదరాగానే వడకట్టి తీసుకువచ్చి, కుర్చీలో ఉన్న మనిషి ఎవరో అనుకుని వెనక్కు తగ్గింది.

ఆయాసం ఒదుల్చుకున్న పిమ్మట "ఏం చెల్లమ్మా ! ఒంట్లో బావుందా?" అని ఉమాపతి అడిగేడు.

"అన్నయ్యా ! నువ్వా?..." దగ్గరగా వచ్చింది. ఉమాపతి అంటే లక్ష్మికి ప్రాణం. ఏంకష్టం వచ్చినా ఉమాపతితో చెప్పనిదే ఆయన ఏమీచెయ్యరనీ, అప్పుడప్పుడు వచ్చినపుడు చెప్పేసలహాలూ, సహాయాలూ కూడా విని వుండికనుక, ఎంతో గౌరవం, వాత్సల్యం అతనిఎడ వుండిపోయేయి.

"ఇంతగా అయ్యేవరకూ ఉత్తరం అయినా వ్రాయకూడదా అన్నయ్యా! ఎల్లా వున్నావో అని వినడానికైనా మేం నోచుకోలేదా? ఎంత మాయిదారి జ్వరం వచ్చింది! నిన్ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది..." అంతకంటే ఏం చెప్పాలో కూడా తెలియలేదు. తొందరగా గదిలో మంచం, పరుపు వేయించి, "అన్నాయ్! కాస్సేపు విశ్రాంతిగా పండుకో" అని చెప్పి పంపించింది.

ఉమాపతి జీవితంలో ఏకాకే. తల్లీ, తండ్రీ కూడా చిన్నప్పుడే చనిపోతే, మేనమామలు పెంచేరు. ఆ కష్టాల్లోనే తెలివితేటలవల్ల పైకి వచ్చి, పత్రికా ప్రపంచంలో కాస్తో కూస్తో పేరుతెచ్చుకున్నాడు. ౧౯౪౨తో పూర్తిగా రాజకీయాలలో దిగి, 'ఉమాపతి గారు' అంటే 'ఓహో! వారా!' అనిపించుకునేవరకూ గౌరవం సంపాదించేడు. ఈనాడు తనకు తోబుట్టువులె లక్ష్మి పూనుకుని, సపర్యలు చేయడానికి ఆదరణగా చల్లనిచూపు చూపించుటకూ అది ఉపయుక్తమవటం చూచి ఆర్ద్రపడిపోయేడు. కాని అంతవరకూ, పారూ కనిపించనేలేదు. కనిపిస్తుందని అనుకున్నాడు. కాని రానేలేదు. హృదయంలో ఆనాడు, చిన్నతనంలో ఏర్పడ్డ భావన ఎన్ని విరుద్ధపరిస్థితులు వచ్చినా చెరగగొట్టుకోలేని నిలకడ వచ్చింది. ఆ భావనే హృదయాన్ని ఝంఝూమారుతాలతో నింపుతోంది.

బహుశః పునః తను పారూను చూడ్డం ఇదే మొదలు. అల్లాంటప్పుడు మారిన స్థితిలో సిగ్గుపడిందేమో, న్యూనతపడుతోందేమో అనుకుని ఊరుకోబెట్టుకున్నా, అవి పూరుకోటంలేదు.

ఆశతో జీవితంలోని వ్యథల్ని, కష్టాల్ని, దుఃఖాన్ని, ఒంటరితనాన్ని దూరంగా త్రోసుకున్నాడు. ఇన్నేళ్లల్లోనూ తనలోనే మండిపోనిచ్చిన సమయాలసారం అంతా, అనుభవపు మూర్తీభవించిన ప్రగతి అంతాకూడా ఇప్పుడు కట్టలు తెంపుతోంది. పారూను చూడాలన్న ఆవేదన ఉద్రిక్తత అయి శాంతిని చెడగొడుతోంది.

అటు సీతాయి ఉమాపతిని పడుకోబెట్టి వంటింట్లో వున్న అక్కగారిదగ్గరకు వెళ్లి "అక్కాయి! ఉమాపతి బావ వచ్చేడు. కాని ఇప్పుడు అతన్ని చూస్తుంటే గుండె చెరువైపోతోంది" అన్నాడు.

అంతవరకూ ఏదో హడావిడి జరుగుతోందని వింటున్నా ఏముఖం పెట్టుకుని వీథిలోకి వెళ్లి ఆహ్వానం ఇవ్వగలనన్న ఉద్దేశ్యంలోనే కూర్చుండిపోయింది. ఇప్పుడు తమ్ముడే ఆవిధంగా చెప్పడం వింటూంటే ఏంఅనాలో కూడా తెలియక మాట్లాడకనే ఊరుకుంది. సమాధానం ఆశించిన సీతాయికి ఇది మృగ్యమే అయింది.

ఆ సాయంకాలపు సంధ్యచీకట్లవరకూ పార్వతి మనస్సు వికలమైందన్నట్లే మూగగా, బాధగానే వుండిపోయింది. మధ్యాహ్నం డాక్టరు రావడం, ఏవోఏవో మందులు చెప్పడం, సీతాయి వెళ్లడం, లక్ష్మి జావ కాచి ఇవ్వడం—ఇవన్నీ చెవులూ, కళ్లూ వప్పగించి చూచింది, వింది. కాని ఓవిధమైన మనస్సులోని పిరికితనం ధైర్యంగా బావని చూడాలన్నా చూడనివ్వటంలేదు. మనస్సు, ఆత్మ, శరీరం ఆక్రోదిస్తున్నాయని తెలుసు. కాని తనకు ఈ పిరికితనం అంకుశ విధిస్తోంది.

భోజనాల దగ్గర సీతాయి "బావని మలేరియా జ్వరం పీక్కుతినేసింది. మందుతినక శరీరాన్ని బలి పెట్టేడు. జాగ్రత్తగా చాకిరీ చేస్తే త్వరలో కోలుకోవచ్చుని డాక్టరు చెప్పేడు" అన్నాడు.

అప్పుడుకూడా పార్వతి వింది. కాని మాట్లాడనేలేదు. లక్ష్మికీ, శీతాయికీ పార్వతి ఉద్దేశ్యం ఏమిటో తెలియక, పరాగ్గానే భోజనం చేసి పైవెళ్లేరు.

ఆకుముందర కూర్చోగానే పార్వతికి దుఃఖం వచ్చింది. ఈనాటి విసర్జితజీవితంలోని ఏకాకిత్వం, సంఘం నియమించిన ప్రణాళికల్లోని అంకుశలు ఎదురు తిరిగేయి. అవి ఎంతో క్రూరంగా నుంచుని, ఇకనే గీచిన గీత దాటనని......అన్నట్లే నవ్వుతున్నట్టు చూస్తే ఏడుపే వచ్చింది.

చిన్నప్పుడు ఉమాపతి తనవాడే అనుకుని మురిసిపోయింది. ఒక్క క్షణంఅయినా విడిచిపెట్టి వుండేది కాదు రోజూ ఒకళ్లనొకళ్లు చూడకుండా, మాట్లాడకుండా ఉండలేకపోయేవారు. దాంతోనే వయస్సుకూడా పెరిగి, భావాల్ని, ఆశల్ని, కోర్కెల్ని కూడా విచ్చుకోనిచ్చింది. ఆ యవ్వనంలో ఒక సంధ్య వేళ ఉమాపతి తోటలో దగ్గరసా చేరి "పారూ! నన్ను పెళ్లాడుతావా!" అని అడిగేడు. తనే సిగ్గులో మాట్లాడలేక గవద ఆన్చి, కువకువమంటే, మొఖం పైకి ఎత్తి, మృదువుగానే ముద్దుపెట్టుకున్నాడు. తక్కిన రోజుల్లో సిగ్గుకోనే మాట్లాడేది. ఇద్దరూకూడా పెండ్లి నిశ్చయం చేస్తారని తెలిసేసరికి స్వర్గంలో ఇళ్లు కట్టుకునే మెసలేరు.

ఆ దగ్గరగా వున్న పదునాలుగువత్సరాల్లోని సంగతులూ ఎదురుగా వచ్చేయి...ఆనాటి బావే ఈనాడు తనింటికి, తను ఏమైనా ఆదరణ, చల్లని చూపు చూపించి, ఈనాటి ఎముకలపోగుకు అమృతం చిలికిస్తానేమో అని ఆశతో, ఆవేదనతో వస్తే, తనే, క్రూరంగా దూరంచేసి, త్రోసిపుచ్చి గుండెల్లో గునపం గ్రుచ్చినానన్న తలంపు కూర్చోనిచ్చింది కాదు.

ఒక్క ముద్దవినా నోట్లో పెట్టుకోకుండానే లేచింది. తలుపు వేసి, త్వరగానే అడుగులు సైచి, గది గుమ్మంలోంచే చూసింది. తనేమైనా ఇంకోవ్యక్తిని చూస్తున్నానేమో అనుకుంది. ఎముకలన్నీ ఆ హరికేన్ దీపంవెల్తురులో లెక్కపెట్టవచ్చునన్నట్టే గాలికి ఊగుతున్నాయి. పాలిపోయిన మొఖంలో నీరసం, ఆయాసం, కంటికింద నలుపూ తన్ను జాలిగా, దేహీ అంటున్నట్టే పలికేయి.

దగ్గరగా వెళ్లింది. "బావా!" నోట్లోని మాట దుఃఖంలో రుద్ధంఅయి పైకి రాలేదు. పిలుద్దామని హృదయం ఆక్షణంలో చించుకున్నా, కన్నీళ్లు ఆగలేదు. నెమ్మదిగానే చెయ్యి నదురుమీద పెట్టింది. పడ్డకన్నీటిచుక్కకు ఉలిక్కిపడి లేస్తూనే "పారూ! నువ్వా?" అన్నాడు. బొటబొటకారుతున్న నీళ్లతోనే "బావా!" అని ఏడ్చింది.

"పారూ! నేను నీదగ్గరకే వచ్చేను..."

"బావా! పార్వతి చచ్చిపోయిందనుకునే ఇన్నాళ్లూ శరీరాన్ని ఇల్లా కాల్చుకున్నావా? నేను లేనన్నే, చచ్చిపోయేననే భావించేవా?"

"లేదు, పారూ!" ఏమీ చెప్పలేని నీరసంతో కళ్లు మూసుకున్నాడు. కాగిన నుదురుమీద ఉడుకులాంగుడ్డ వేసి, విసనకర్రతో చల్లగా విసిరింది...

ఉమాపతి నిద్రపోయేడు. అంతవరకూ కన్నార్పకుండానే అతన్ని చూచి దుఃఖపడింది. ఏడ్చింది. దానికి అంతంలేదు. 'తన బావ తనదగ్గరికే వచ్చేడు' అని చాలాసార్లు అనుకుంది. అందులో శాంతిపొందినట్టే హృదయం తేలికపడుతోంది. తను చాకిరీ చేసి, తనబావని కాపాడాలి. తనకంటే ఇంకెవ్వరున్నారు బావకి...అన్న విభిన్నఆలోచనల్తో చాపమీద నిద్రపోయింది పార్వతి.

* * *

అదిమొదలు పార్వతికి జీవితంలో ఓ నూతనాధ్యాయం ప్రారంభించినట్లే వుంది. ఉదయంమొదలు సాయంత్రంవరకూ తీరుబడే లేకుండా వుంది. కాఫీ త్రాగించడం, ఒళ్లు తుడవడం, మందు త్రాగించడం, జావ కాచడం ఇల్లాంటి పనుల్తోకాక, అస్తమానూ అఁ నెల్లావున్నాడో, నిద్రపోతున్నాడా మెలకువగా వున్నాడా, జ్వరం వస్తున్నట్టు వుందా అని గదిలోకి వెళ్లడం రావడంతో కాలం సరిపోయేదే కాదు. వంట చెయ్యడంకూడా, ఆ అన్నం మెతుకులు కాసిన్ని ఉడకవేసి, వ్యంజనంక్రింద ఊరగాయతోనే సరిపుచ్చేది.

మొదటి మూడురోజులూ సీతాయీ, లక్ష్మీకూడా "బీమారు అయివచ్చేడు. కాస్త సదుపాయం చూడకపోతే బాగుండదని పార్వతి చూస్తోం"దని అనుకున్నారు. కాని ఒక్కొక్క రోజు గడవడంతో ఈ సపర్యలూ సదుపాయాలూ విపరీతంగా మరీ పిచ్చులోకి దిగేసరికి సిగ్గుకూడా కలిగింది. అంత ఒళ్లుమరచి చాకిరీ చెయ్యడంలోని గూఢార్థం వింతగానే స్ఫురించింది. అయినా ఉమాపతిమొఖం చూచీ, పార్వతినోటికి దడిసీ ఇద్దరూకూడా ఏమీ అనలేకపోయేరు. పార్వతి

చర్యల్ని మొట్టమొదటినుంచి సింహావలోకనం చేసుకుంటే, అమావాస్య పౌర్ణమికళలు ఉన్నట్టే తట్టింది. ఒకనాడు విందు, రెండోరోజు మందు! అల్లాగే ఇదికూడా ఏకో విపరీతానికో, మరోసుముఖానికో దారి అనుకునే ఊరుకున్నారు.

ఆరోజు భోజనాలు చేసి కూర్చున్నప్పుడు, ఎక్కడ విందో పార్వతి, సోదిదాన్ని పిల్చింది. చెప్పించుకునేవరకూ లక్ష్మిని ఒదిలిపెట్టింది కాదు. దగ్గరగా కూర్చోపెట్టి 'ఆడపిల్లా, మగపిల్లాడా?' అని తనే అడిగితే లక్ష్మికి సిగ్గు ముంచేసింది. ఆ సాయింత్రమే, సీతాయి ఇంటిగుమ్మం మెట్లు ఎక్కుతుండగానే "ఒరేయి! నాకు మేనల్లుడే పుడతాడుటరా!" అని పాలికేకలాగే అని సంబరపడింది. సీతాయి,అక్క ఆవిధంగా అనడం సిగ్గు కలిగించినా, లోపల్లోపల చాలా సంతోషించేడు. అకబురూ ఈకబురూ చెపుతూనే "మన పూరి మస్తానమ్మకు లక్ష్మిచేత పూజ చేయిస్తానన్నానురా! ఓ ఆదివారం వెళ్లాలి. చల్లగా పురుడు రావాలని మొక్కుకున్నానురా!" అంది.

అటు ఉమాపతికూడా గాలి, నీరుల మార్పువల్లనేమి, మందుల ఫలితంగానేమి, అన్నిటికన్నా ముఖ్యంగా పార్వతి చేసే సపర్యలవల్లనేమి కాస్త లేచి తిరగడం, ఒక్కపూట అన్నం తినడంవరకూ వచ్చేడు. కొంచెంకొంచెంగా పట్టే రక్తంవల్ల బుగ్గలు తెలుపు వదల్చుకొన్నాయి. రాత్రిళ్లూ, శెలవుదినాలల్లోనూ అందరూ కూర్చుని ఈకబురూ, ఆకబురూ చెప్పుకుని కాలం గడిపేవారు.

ఉమాపతి తనంతట తాను లేచితిరగడం, నీరసించిన నోటిమాటలూ శక్తి కోలుకోవడంతో పార్వతికి ఏవోఏవో ఆశలు మొలకలెత్తేవి.

ప్రపంచకంలో, ఎన్నో విషయాలు వింది. 'పునర్వివాహం ఎందుకు చేసుకోకూడదూ? తను అడిగితే ఉమాపతి జవదాటుతాడా?' ఇల్లాంటి ప్రశ్నలు, దానికి సమాధానాలు మధురంగానే కలిగేవి. కాని ఇప్పటి సన్నివేశంలో, ఆ హృదయంలో తనకు ఏవిధమైన స్థలంవున్నదో అన్న భావన దిగతీస్తోంది.

ఒక్కటి ధైర్యం వుంది. వయస్సు ముదిరిందన్న పేరేకాని, తన శరీరంలో మార్పు, రూపంలో కురూపత్వం రాలేదు. అద్దం ఎన్నోసార్లు చూచుకునేది. జడ ముడిచి, పువ్వులు తురుముకోవాలి; తన బావకి ఒక్కసారి తన అందం చూపిస్తే, తన్ను ఒద్దనలేడు, త్రోసిపుచ్చలేడు అన్న ధైర్యం వచ్చేది. కాని ఇప్పుడు తన తమ్ముడూ మరదళ్ల ఎదుట ఆపని చెయ్యలేదు. వాళ్లూ ఎంత ఆప్తులైనా, తను ఎంత చాకిరీచేసి ఎంతడబ్బు ఇచ్చినా, సంఘంలోనివారే! లక్ష్మి రేపో ఎల్లుండో పిల్లాణ్ణి కంటుంది. 'తన కొడుకు' అని చెప్పుకుని విర్రవీగుతుంది. సంతతి కావాలని తనూ ఉవ్విళ్లూరింది అప్పుడు. కాని కొద్దికాలం ఆ జీవనాన్ని పోషించేరుచి చూపించి దూరం చేసేడు. కాని కోర్కె చావలేదు.

ఇప్పుడు, తన కోర్కె ఫలిస్తే, ఉమాపతే తన్ను వివాహమాడితే, తనకూ సంతతి కల్గుతుంది. తనూ పోషిస్తుంది. తనూ లాలిస్తుంది.

ఆ భావనల్లోనే, తనకంటే లక్ష్మికి ముందుగా ఎందుకు కల్గాలి అన్న ఈర్ష్య, ద్వేషం క్రమేణా ఆక్రమించుకున్నాయి. ఇప్పుడు లక్ష్మిని చూస్తేనే కోపం వస్తోంది. తనకంటే ముందుగా ఆమె మాతృత్వం వహించకూడదు. అది తను చూడలేదు.

ఈ మార్పుల్లోని భావనే లక్ష్మియెడ చూపడం ప్రారంభించింది. విస్తళ్లలో వడ్డిస్తూనే "జవసత్తువలు ఉడిగిపోతున్నాయి ఈ చాకిరీతో. ఎన్నాళ్లు ఈ అమ్మలక్కల్లా కూర్చోడం" అని సణిగింది. శూలంలా తగిలింది ఆ ముక్క. ఇన్నాళ్లూ ఏ అలుకుడూ లేకుండానే జరిగింది. కాని ఈనాడు మళ్లా పుండు రేగింది. సీతాయి ఈరోజుల్లో ఏదో ఎదురుచూచేడు. అది రానే వచ్చింది. ఇల్లాంటి విషయాలు ఆరోజుల్లో తగులుతూనే వున్నాయి. కాని అంతం ఎప్పుడో అర్థం కాలేదు.

ఉమాపతికూడా అప్పుడప్పుడు పార్వతి అనే వాక్కులు విని కష్టం పెట్టుకున్నాడు. తను వచ్చినప్పటినుంచి పార్వతి మారిందనుకున్నాడు. కాని అది

విరుద్ధపరిస్థితుల్లోకి దారితీస్తుందేమో అని భయంపేసు తోంది. ఏదో ఒకరోజున ఆ ఉప్పెన ఒస్తుందని అంత రాత్మ చెప్పుతున్నట్లే అనుభవించేడు.

ఆ సాయంకాలం అనుకోకుండానే పార్వతి పెద్దబావగారు విజయరామయ్య వచ్చేడు. ముఖా ముఖీగా ఆ స్త్రివిషయం, తను పంపకంలో అవలంబించిన పద్ధతీ చెప్పి, దస్తావేజుముపాయిదాల మీద సంతకం తీసుకుని వెళ్లిపోయేడు. ఆయ నాగుమ్మం దాటగానే "సీతాయి! ఇప్పుడు నీకు కళ్లు చల్లగా వున్నట్టుంది. మీఆవిడకి నగలు చేయించవచ్చులే!" అంది పార్వతి.

ఒణికిపోయేడు. వినపడీవినపడనట్టుగా చెవికి సోకిన ఆమాటలు ఉమాపతిని నిరుత్తరుణ్ణిగానే చేసింది. కోపంలో ‘పార్వతీ!’ అని ఒక్క వెర్రికేక పెడదా మనుకున్నాడు. కాని తన బలహీనతలో లోపల్లోపలే కుములుకున్నాడు. పార్వతి ఇల్లా కత్తిమీదవాటంగా అవలంబిస్తున్న మార్గం మార్చడం ఎల్లాగ అన్నదే సమస్య అయింది.

అటు సీతాయీ, లక్ష్మీకూడా ఏడ్చేరు.— బాధలో...

* * *

ఆ ఆదివారంనాడు ఆపేక్షతోనే లక్ష్మిని మస్తా నమ్మదగ్గరకు తీసుకువెళ్లింది. దారిలో ఒస్తూ ఎరుకల దాన్ని ఓసారి తనింటికి రావలసిందనీ, అమ్మాయి ఒంట్లో బాగాలేదనీ, ఓసారి చూడాలనీ చెప్పింది. ఇంటికి రావడంతోనే దిగతుడుపు తీసి ఆయాసంగా వుందేమో అని పడుకోమంది.

ఇన్నాళ్లూ మారిన తత్వంలోంచి ఈనాటి ఆపేక్ష ఆలోచన కలిగించింది లక్ష్మికి. ఆ సాయింత్రం ఎరుకలది రావడం, ఇద్దరూ ఏదో గుసగుసలాడడం జరి గిందని తను వింది. కాని తన్ను చూడకుండానే ఎరుక లది ఎందుకు వెళ్లిందో అర్థం కాలేదు. పైగా అనుమానం కూడా కలిగింది. అయినా తను ఆ అనుమానంలో చెడుగు ఎక్కువగా భావించుకోలేకపోయింది.

వంట త్వరత్వరగా చేసి, మంచందగ్గరకే తెచ్చి పెట్టింది. పడుకోపోయేటప్పుడు పాలు తీసుకువచ్చి ఇచ్చింది... కాని అంత ప్రేమతో చూచిన ఒదినలో తను తప్పు ఎంచుకోవడం మూర్ఖత్వం అనుకునే నిద్ర పోయింది.

ఆనాటిరాత్రి పదిఘంటలూ కొట్టడం వింది పార్వతి. తనకు ఏవో నూత్నశక్తులు వచ్చినట్లే వుంది. లేచింది. చాటుగా దాచుకున్న అద్దంముందర కూర్చుని తల దువ్వుకుంది. పువ్వులు తురుముకుంది. అంతవరకూ కొన్ని నెలలనుండీ పెట్టుకోని తిలకం పెట్టుకుంది. దాచుకున్న ఆరుద్రపురుగురంగుచీరా, పచ్చటిబుట్టచేతులజాకెట్టూ తీసింది...సీతాయీ, లక్ష్మీ పండుకున్నారో లేదో అని చెవియొగ్గి వింది.

మైకంలోనే నెమ్మదిగా గుమ్మం దాటింది. ఒత్తిగిలి పండుకున్న మొఖంమీద సన్నటి వెల్తురు పడుతుంటే, అందులో ఆ చిన్నప్పటిబావే కన్పించేడు. తనే మారిందేమో! దగ్గరగా వెళ్తూనే బుగ్గమీద చెయ్యివేసింది.

ఉలిక్కిపడి లేచేడు ఉమాపతి. తను ఏమైనా కలకంటున్నాడేమో అని కళ్లు నులుపుకుని పునః చూచేడు. ఆశ్చర్యపడుతూ "పారూ! నువ్వే..."

"అవును బావా! బాగాలేనూ...?"

ఏం చెప్పాలో ఉమాపతికి తట్టలేదు.

"బావా! నీకోసం వచ్చేను. ఇప్పుడు నీకంటే నాకు ఇంకెవ్వరున్నారు? ఆనాడు తోటలో అన్నావ్. అప్పుడు నీదాన్ని కాలేకపోయేను. ఇప్పుడు నీకోసం వచ్చేను...మనిద్దరం ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోదాం. ఈనాడు నీచేతుల్లో నన్ను పెట్టి నాజీవితం అంతా ధారపోస్తా. రావూ బావా!"

ఉద్రిక్తఅయిన పార్వతిని తను ఏవిధంగా, పరిస్థితులను సరిచేసి చూపెట్టాలో అర్థంకాక తికమక పడ్డాడు. "పారూ!..." ఆగేడు.

"ఏం బావా! ఒస్తా ననవ్...ఈరాత్రే వెళ్లిపోదాం."

"నువ్వే మడుగుతున్నావో ఆలోచించేవా? వెళ్ళిపోతామనుకో... నాపేరు.... సంఘం.... సీతాయి, లక్ష్మి వీళ్ళేమనుకుంటారో ఆలోచించావా? నాకోసం త్యాగం చేస్తానన్నావ్! చెయ్యి... ఇన్నాళ్లూ నన్ను నీమనస్సులోనే ప్రేమించేవ్! ఇప్పుడూ ప్రేమించు. రేపు లేచి దూరంగా వెళ్ళిపోతామనుకో. అప్పుడు కాలం జరిగిజరిగి, మనం ఒకళ్ళకొకళ్ళకు బాగా పరిచయం, చనువు అవడంతో ఏఆశతో వెళ్లుతామో అది చవకఅయిపోయి, ఇప్పటి మహత్తరత ఉండదు పారూ!"

"అయినే, రావా బావా?"

"శరీరవాంఛలకొరకు, పారూ, నీతీ, నియమం, ఆరాధన చెడగొట్టకు... దూరంగా ఉండడంలోనే గొప్పతనం ఉంది పారూ!"

సగం చచ్చింది. కథలు వ్రాసేవారి పిచ్చి వేదాంతంలా కట్టింది. అయినా తను ఎంత ఆశపెట్టుకుని వచ్చిందో, అంత నిరాశ పొందింది. తనవాడనుకున్న ఉమాపతి క్షణంలో దూరమైపోయేడు. ఇంకేం మిగిలింది?

"ఇన్నాళ్లూ చేసిన చాకిరీకి కృతజ్ఞత ఇదేనా?"

"అల్లా అనకు పారూ! హృదయపూర్వకంగా..." చేయెత్తేడు.........బొటబొటా కన్నీళ్లు కారేయి పార్వతికి...

గదిగుమ్మం దాటింది... "అక్కాయ్! నీకోసం చూస్తున్నా" ఖంగారులో అన్న సీతాయి పారూ వేషం చూచి నిర్విణ్ణుడయ్యేడు.

కొద్దిగంటలక్రితం తనుచేసిన క్రూరమైన ప్రతీకారం భావనల్లోని ఆశలుపతనం చేస్తే లక్ష్మికి చేసింది. ముఖం చూపించలేకనే... లోపలికి వెళ్లింది.

"బావా! డాక్టర్ను పిలవాలి. లక్ష్మి అమితంగా బాధపడుతోంది . ..." సీతాయికేక వింది. వాళ్లు ఖంగారుపడ్డం చూచింది. తన గదిలో తలుపులు బిగించుకునే, డాక్టరు జోళ్లచప్పుడు, వాళ్ల ఆరాటము శాంతించడం వింది... గంటలు జరిగేయి. కంటిమీద కునుకే రాలేదు.

ఉదయంఅవడంతో తను మొఖం ఎల్లా చూపిస్తుంది. ఉమాపతిమీద ద్వేషం, కోపం, ఇప్పుడు భయంకూడా కలిగింది. సీతాయినీ లక్ష్మినీ పలకరించుటకు హక్కే లేదు... ఏం చెయ్యాలి...... మొట్టమొదటి నుండి తన జీవితం పతనమే అయింది. ఈనాడు అది పూర్తిగా, నాఅన్నవారు లేకుండా, ఏకాకిని చేసేయి. తను బ్రతకాలి... ఇక్కడ కాదు... ఎక్కడో?

చీకటి వుండగానే దాసీదానిచే బండి పిలిపించింది. ఉన్న కొద్దిబట్టలూ, బావగారిచ్చిన డబ్బూ మూటకట్టుకుంది. అందులోనే తన బ్రతుకు వుంది... కన్నీరు తుడుచుకొని, మూట చంకను పెట్టుకుంది. బండిలో కూర్చుని, 'పోనీ' అంది. ఎక్కడికో, ఏంచెయ్యడానికో... తనవాళ్లను చూడలేకనే... ఏడుస్తూనే... ఏకాకిగానే... స్వర్గంనుండి అవరోహణఅయిన మానవిలాగే... నిపాది.